కథ

చైనా విప్లవం ఆ దేశ సాహిత్యాన్ని సంపద్వంతం చేసింది. సుదీర్ఘ పోరాటంలో పాల్గొన్న మానవుల ఆశల్ని, అనుభూతుల్ని అద్భుతంగా ఆవిష్కరించింది. చైనా విప్లవం విజయవంతమయి యాభై ఏళ్ళయిన సందర్భంగా పోరాట కాలంలోని చైనీయుల జీవితంలోని ఒక మానవీయ అంశాన్ని వ్యక్తీకరించే కథను పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

# విముక్తి

చిన్ కెంగ్



**అది 1947లో వసంతకాలం. నన్ను మరికొందరు కామ్రేడ్స్ తోపాటు పాయ్‌చావో పర్వత ప్రాంతానికి పంపించారు. కొమింటాంగ్ మూకలతో పోరాడుతున్న ప్రజా విముక్తి సైన్యం ఊపిరి పీల్చుకునేందుకు వీలుగా వెనుక భాగంలో రక్షణ శ్రేణుల్ని ఏర్పాటు చేయటం మా పని.**

మా దళ నాయకుడు ఈ ప్రాంతం వాడే. ఇంతకుముందు జపాన్ దురాక్రమణ వ్యతిరేక యుద్ధంలో అతను ఈ ప్రాంతంలోనే గెరిల్లాగా పోరాడి ఉన్నాడు.

ముందు మేమందరం కలసి ఆ ప్రాంతాన్ని గురించిన వివరాలన్నీ చర్చించుకున్నాం. ఈ ప్రాంతంలో ఉన్న గ్రామాలెన్ని? మనకు ఏ గ్రామంతోనైనా ఇదివరకే రహస్య సంబంధాలున్నాయా? ఎక్కడెక్కడ మనకు పనికివచ్చే కొండ గుహలూ, దేవాలయాలూ ఉన్నాయి?

ఈ వివరాలన్నీ మా దళ నాయకుడు తన జ్ఞాపకాన్ని బట్టి కొంత, స్థానిక ప్రజల సహకారంతో కొంతా రూపొందించాడు.

మొత్తం మీద ఆ ప్రాంతం మ్యాపు ఒకటి అప్పటికప్పుడు తయారు చేసుకున్నాం. దళంలో వారందరం ఒక్కొక్కరికి ఒక్కో ప్రాంతం కేటాయించుకుని బాధ్యతలు పంచుకున్నాం. ఆ ప్రాంతం అంతా పర్వతశ్రేణులతో నిండి ఉంది. ప్రస్తుతం కొమింటాంగ్ స్వాధీనంలో ఉంది. ఎక్కడా ఖాళీ లేకుండా అడవులతో నిండి ఉంది.

నాకు అన్నింట్లోకీ విశాలమైనదైన మిల్‌స్టోన్ పర్వతప్రాంతం అప్పగించబడింది. దాదాపు ఏడుమైళ్ళ పొడుగునా పర్వతశ్రేణి ఉంది ఆ ప్రాంతంలో. కొంతకాలం క్రితం మా రెడార్మీ ఈ ప్రాంతం గుండా ప్రయాణిస్తున్నప్పుడు చాంగ్‌లాన్ అనే ఓ కామ్రేడ్ గాయం మూలంగా ఇక్కడే ఆగిపోయాడు. అతనీ ప్రాంతంవాడే. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కూడా. నేనతన్ని కలుసుకోగలిగితే చాలా వివరాలు తెలుస్తాయి. కానీ, అతనెక్కడున్నాడో తెలియదు. కామ్రేడ్సంతా రహస్యంగానే పని చేస్తున్నారు. చుట్టూ బలమైన కొమింటాంగ్ సేనా వలయం ఉంది. కమ్యూనిస్టనే అనుమానం ఉన్నవాడనల్లా కాల్చిపారేస్తున్నారు.

నా సంచీలో సామాన్లన్నీ సర్దుకుని భుజాన వేసుకున్నాను. నా ఆటోమాటిక్ పిస్తోల్ సరిచూసుకుని బయలుదేరాను.

ఉదయం. మంచు బిందువులు ఇంకా రాలుతూనే ఉన్నాయి! మంచుతెరల్లోంచి దూరాన వున్న కొండలూ, చెట్లూ మసకగా కనుపిస్తున్నాయి. పైన దట్టంగా మేఘాలు కమ్ముకునున్నాయి.

పర్వతాలు నాకెప్పుడూ ఉత్తేజాన్నిస్తూ ఉంటాయి! నేను పుట్టి పెరిగింది మైదాన ప్రాంతాల్లోనే. అయినా పర్వతాలను గురించి ఎన్నో కథలు విని ఉన్నాను. అవి అద్భుతంగా ఉంటాయి! ఉత్తేజ కరంగా ఉంటాయి! సాహసాలకు ప్రేరేపించేవిగా ఉంటాయి! అటువంటి పర్వతాల్లోకి నేనిప్పుడు స్వయంగా అడుగుపెట్టాను.

కొంతదూరం అలా ఒంటరిగా కాలిబాటన నడిచాక అకస్మాత్తుగా గర్జన వినిపించి ఆగిపోయాను. చుట్టూ ఉన్న ప్రకృతినీ, పర్వత రమణీయాన్నీ ఆస్వాదిస్తూ నడుస్తున్న వాడినల్లా చటుక్కున పిస్తోల్ తీసి వంగున్నాను. సరిగ్గా కొద్ది గజాల దూరంలో ఓ చెట్టు కొమ్మపై నల్లమచ్చల చిరుతపులి నా వంకే చూస్తూ గర్జిస్తోంది. దాని గర్జన ఆ నిశ్శబ్ద ప్రకృతిలో భయంకరంగా ఉంది. అది దాదాపు గుర్రప్పిల్ల సైజులో ఉంది. నా వంటివాళ్ళను నలుగుర్ని అవలీలగా పడగొట్ట గలిగేట్లుగా ఉంది. నాకేసి గుర్రుగా చూస్తూ నోరు తెరిచి ఆవులించింది.

నేనో అడుగు వెనక్కు వేశాను. పొజిషన్ చూసుకుంటూ పిస్తోల్ తీశాను. కానీ,

**పర్వతాలు నాకెప్పుడూ ఉత్తేజాన్నిస్తూ ఉంటాయ్! నేను పుట్టి పెరిగింది మైదాన ప్రాంతాల్లోనే. అయినా పర్వతాలను గురించి ఎన్నో కథలు విని ఉన్నాను. అవి అద్భుతంగా ఉంటాయ్! ఉత్తేజకరంగా ఉంటాయ్! సాహసాలకు ప్రేరేపించివిగా ఉంటాయ్! అటువంటి పర్వతాల్లోకి నేనిప్పుడు స్వయంగా అడుగుపెట్టేను.**

ఆ వెంటనే దాన్ని సంచిలో సర్దేశాను. ప్రజల్లో ఉన్న నానుడి గుర్తుకు వచ్చింది. "అడవి జంతువులేవీ నీవు వాటి జోలికి పోతే తప్ప నీకు హాని చేయవు. వాటి జోలికిపోతే మాత్రం చీల్చి చెండాడుతాయి."

నిజమే! మరునిమిషమే ఆ చిరుత గిర్రున వెనక్కు తిరిగి మరో కొమ్మ మీదికి జారుకుంది. "నీతో నాకేం సంబంధం లేదు. నీ దారిన నీవు పో!" అన్నట్లుంది దాని ప్రవర్తన.

గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని ముందుకు సాగేను. మేం తయారు చేసుకున్న మ్యాపు ప్రకారం నేనింకా చాలాదూరం నడవాల్సి ఉన్నాను. ముందు చాంగ్‌లాన్‌ను వెతికిపట్టుకోవాలి. అతన్ని కలుసుకుంటే నా పని సులువవుతుంది. ఈ మధ్యకాలంలో అతనేమయ్యాడో! శత్రువులకు చిక్కకుండా ఉన్నాడా? ఒకవేళ అనారోగ్యం నుండి కోలుకుని ఇదివరకే సురక్షితంగా రెడార్మీలోకి వెళ్ళిపోయాడేమో?

నేను నడుస్తున్న బాట రానురాను పెద్దదవుతోంది. అక్కడక్కడా కొన్ని పక్కదారులు కనిపిస్తున్నాయి. దారి బాగా నలిగి ఉంది. అంటే, నేను ఏదో గ్రామం పొలిమేరలకు వచ్చేశానన్నమాట.

ఆగిపోయాను. దగ్గర్లో ఓ చెట్ల గుబురు కింద ఓ యువతి కూర్చుని ఉంది. చిరుగులు పడిన బట్టకు అతుకులు వేస్తోంది. నన్ను గమనించినట్లు లేదు. ఆవిడ కూడా అతుకులు వేసిన బట్టలే కట్టుకునుంది. నెత్తిన ఓ గడ్డి టోపీ, కాళ్ళకు గడ్డిచెప్పులూ ఉన్నాయి. ఆవిడదే కాబోలు దగ్గర్లో ఓ గేదె గడ్డి మేస్తోంది.

ఓ క్షణం ఆగి ఆలోచించి ఆమె దగ్గరకు వెళ్ళాను. "ఈ ఊళ్ళో చాంగ్ కుటుంబీకుల ఇల్లు ఎక్కడో తెలుసా, అమ్మాయీ?" అనడిగాను. "అమ్మాయీ" అన్నానేగానీ నేనూ ఆమె వయసువాడినే.

పెద్ద కళ్ళను విప్పార్చి నా వంక తేరిపార చూసింది. "ఏమిటీ?" అంది అర్థం కాని దానిలా.

"నేను చాంగ్ కోసం వెతుకుతున్నాను. వాళ్ళ ఇల్లు చూపగలవా?" జాగ్రత్తగా అడిగాను.

ఆవిడకు అర్థమైనట్లుంది. చేయెత్తి పర్వతపాదానికేసి చూపించింది.

"అదుగో, అక్కడుంది!" అంది నిదానంగా.

ఆ ప్రాంతమంతా దట్టంగా వెదురుపొదలు ఎత్తుగా పెరిగివున్నాయి. వాటి మధ్యగా ఓ చిన్న కొయ్య ఇంటి మూల కనిపిస్తోంది. ఆవిడ చూపకపోతే అక్కడో ఇల్లు ఉందనికూడా నేను గమనించగలిగి ఉండేవాడిని కాదు.

"అక్కడికి వెళ్ళడం ఎలా?" అనడిగేను. దారి ఎక్కడా కనుపించటం లేదు. ఆ వెదురుపొదలను చీల్చుకుని పోవటం ఎవరికీ సాధ్యం గాదు.

ఆవిడ ఓ చుట్టు దారిని చూపించింది. తన గేదెను తోలుకుంటూ ఆ అడవిలో మాయమైంది.

అప్పటికి మధ్యాహ్నం అయింది. చుట్టుదారిన ఆ ఇంటికి చేరటం కష్టమే అయింది. నే వెళ్ళేసరికి ఇంట్లో ఎవరూ లేరు. అది చిన్న రెండుగదుల ఇల్లు. ముందుగదిలో చిన్న టేబుల్, రెండు పొట్టి స్టూల్స్ తప్ప మరేం లేవు. ఓ మూల స్టవ్, వంట సామాగ్రి ఉన్నాయి. అవి ఉన్నతీరును బట్టి ఆ ఇంట్లో ఉండేవారు కొద్ది సేపటి క్రితమే బయటకు వెళ్ళినట్లనిపించింది.

"ఎవరూ లేరా?" అని చిన్నగా కేకవేసేను. నా కేకే ప్రతిధ్వనించింది.

ఆ వాతావరణం, గది నాకు చిన్నప్పుడు విన్న కథల్లో నిదిగా అగుపించింది. మంత్రబలంతో మరో ప్రపంచంలోకి వచ్చిపడ్డానా అనిపిస్తోంది. రెడార్మీలో పని చేసిన తర్వాత కామ్రేడ్ చాంగ్ ఇలాంటి వాతావరణంలో ఒంటరిగా ఎలా వుండగలుగుతున్నాడూ?

చల్లగాలి జివ్వున నా మెడను తాకింది. ఆ ఇంటికి వెనుకద్వారం తెరిచిఉంది.

అటునుండి గాలి బలంగా వీస్తోంది. ఆ ద్వారంగుండా బయటకు నడిచాను. ఆ వెనుక దట్టమైన వెదురుపొదలున్నాయి. గాలికి కూడా ఊగనంత బలంగా, దట్టంగా పెరిగి ఉన్నాయి. చాంగ్‌ను పిలుస్తూ ఆ పొదలగుండా నడవసాగాను. కానీ, సమాధానం లేదు. ఏమై ఉంటాడు? ఒకవేళ ఆ పిల్లగానీ నన్ను ఏడిపించటం కోసం తప్పు ఇల్లు చూపలేదుగదా? ఏది ఏమయినా నేను చాంగ్‌ను కలుసుకుతీరాలి.

సందేహిస్తూనే ఇంకా లోపలికి సన్నని కాలిబాట వెంట నడవసాగాను. దారీ ఏమంత బాగుండలేదు. అకస్మాత్తుగా వెనుకనుండి రెండు ఉక్కులాంటి చేతులు నా చుట్టూ బిగుసుకున్నాయ్! కదలటానికీ, వెనక్కి తిరిగి చూడటానికీ కూడా వీల్లేకుండా నన్ను బంధించేశాయి!

"స్వర్గానికి దారి చాలా విశాలం. కానీ, నీవు నరకానికి ఇరుకుదారినే ఎన్నుకున్నావ్! చెల్లాయ్! ఆ తాడు ఇలా తీసుకురా!" అంది నన్ను పట్టుకున్న మనిషి కంఠం.

నేను పెనుగులాడలేదు. "నన్ను వెళ్ళనివ్వండి. మీరు పొరపడ్డారు. నేను ప్రజలమనిషినే!" అన్నాను.

ఆ మనిషి బిగ్గరగా నవ్వేడు. "ఏమిటీ? ప్రజల మనిషివా? నీ కొమింటాంగ్ నక్కజిత్తులు నా దగ్గర పారవురా, నాయనా" అన్నాడు.

ఓ యువతి తాడుతోసహా నా ముందు ప్రత్యక్షమయింది. ఆమె మరెవరో గాదు, నాకు దారి చూపించిన మహానుభావు రాలే. ఓ చేతిలో తుపాకి, మరో చేతిలో త్రాడూ ఉన్నాయి.

"నీ వద్దకు దారి అడిగింది వీడే అన్నయ్యా!" అంది ఆ అమ్మాయి నవ్వుతూ.

"ఓహో! దారి తెలిసిందిగా! ముందు వీడిని కట్టిపడేద్దాం. తర్వాత కొన్ని ప్రశ్నలడగాలి. ఈ ఏడాదిలోనూ ఈ కొమింటాంగ్ గూఢచారులు నన్నెంతగా విసిగించారో! వీళ్ళ అంతు తేల్చుకోవాల్సిందే!" అన్నాడు నన్ను పట్టుకున్నతను కోపంగా.

అర్థమయింది. అతనంత కోపంగా ఉన్నదెందుకో. అయితే నన్ను పట్టుకున్నది చాంగేనన్నమాట.

"నన్నపార్థం చేసుకున్నారు కామ్రేడ్స్! నన్ను నాలుగో అన్నయ్య పంపించాడు" అన్నాన్నేను.

"నాలుగో అన్నయ్యా?" నన్ను చుట్టిన చేతులు కొంచెం వదులయ్యాయి. అది మా దళ నాయకుని మారు పేరు. ఈ ప్రాంతపు కామ్రేడ్స్‌కు మాత్రమే తెలుసు అది.

"నువ్వెవరి కోసం వెదుకుతున్నావు?"

"చాంగ్ లాన్ కోసం"

చేతులు పూర్తిగా విడిపోయాయి. ఆ చేతులే నా భుజాల్ని పట్టి నన్ను వెనక్కి తిప్పేయి. ఆ చేతుల కంపించటాన్ని గమనించేను.

"చావోజు తిరిగివచ్చాడా?" అని ప్రశ్నించాడతను.

"అవును! అతను మా దళ నాయకుడు.!!

క్షణం క్రితం వరకూ మహాకఠినంగా ఉన్న చాంగ్ ఆడపిల్లలా మెత్తబడిపోయాడు. అతని కళ్ళలో ఆనందాశ్రువులు నిలిచాయి. రెండు చేతుల్తోనూ అమాంతం వాటేసుకుని నన్ను హృదయానికి హత్తుకున్నాడు.

"ఎట్టకేలకు మీరంతా వచ్చేశారన్నమాట! ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాను ఈ రోజు కోసం...!"

అతని కంఠం వణికిపోతోంది.

ఆనందాశ్రువులు నా భుజాన్ని తడుపుతున్నాయి.

*('నాకో పిస్తోల్ కావాలి' చైనా కథల సంకలనం నుంచి)*

అనువాదం: చలసాని ప్రసాదరావు

# ఆచరణ, అవగాహనలే మావో కరదీపికలు!

"**మావో** వాస్తవికతను ప్రతిబింబిస్తూ, దాని కోసం పోరాడే సందర్భంగా ప్రవేశపెట్టిన సూత్రాలను, సిద్ధాంతాలను అత్యధిక ప్రజానీకం మనోభావాలనూ, కష్టనష్టాలను, ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించాడు" - చౌ-ఎన్-లై అన్న మాటలివి. చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్‌కు చౌఎన్‌లై అగ్రగామి నాయకుడు.

'మావో నుండి నేర్చుకుందాం' అన్న ప్రసంగంలో చైనా యువజనులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆ ప్రసంగంలో ఇంకా ఆయన చాలా విషయాలను నొక్కిచెప్పారు. అయితే చైనా ప్రజాతంత్ర రిపబ్లిక్ ఏర్పాటై 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా ప్రపంచమంతటా మరోసారి అందరి దృష్టి అటువైపు మళ్ళింది. అందులో ప్రముఖంగా చైనా విప్లవం, దానిని సాధించి పెట్టిన నాయకుడు మావో జెడాంగ్‌లు కేంద్రబిందువులయ్యారు.



అనుభవం, ఆచరణలో వచ్చిన అవగాహన మావో ఆలోచనా విధానానికి మూలాలు.

చైనా విప్లవం, మావోల గురించి మనం ఎందుకు ఆలోచించాలి? ఎందుకు ఆలోచిస్తున్నాం? అయితే వీటి గురించి ఇప్పటికన్న గతంలోనే ఎక్కువ మాట్లాడాం. అదీ అనుకూలమే కావచ్చు, వ్యతిరేకమే కావచ్చు కానీ ఎంతో లోతుగా ఆ విషయాలు చర్చనీయాంశాలయ్యాయి. కాని చైనా నుంచి మనం ఏమి నేర్చుకోవాలో అదీ కాకుండా, దానికి భిన్నంగా అతిపోకడలుపోయాం. మావోను భారత విప్లవానికి చైర్మన్‌గా భావించిన విప్లవకారులు ఆయన నుంచి నేర్చుకున్నది శూన్యం.

మార్క్సిజం, లెనినిజాన్ని సిద్ధాంతంగా తీసుకున్న చైనా కమ్యూనిస్టుపార్టీ నేత రష్యా నాయకులు చేసిన సూచనలను మిత్రపూర్వకంగా తిరస్కరించాడు. అంతేకాకుండా చైనాలో రష్యా అనుభవాలు పనికిరావని తేల్చి చెప్పాడు. రష్యాలో లాగా, పట్టణాలు కేంద్రంగా కాకుండా గ్రామీణప్రాంతాలు ముందుగా విముక్తి కావాలని సొంతపార్టీలో కూడా విభేదాలను అధిగమించి నూతన ప్రజాతంత్ర విప్లవమనే కొత్త సిద్ధాంతాన్ని రూపొందించి అమలుచేశాడు. అంతకాకుండా పార్టీలో మెజారిటీ లేనప్పటికీ, ఒక దశలో బహిష్కరణకు గురైనప్పటికీ చర్చలకు, కంఠశోషలకు పరిమితం కాకుండా, రైతాంగంలోకి వెళ్ళి తాను రూపొందించిన సిద్ధాంతం ప్రాతిపదికగా ఆచరణకు పూనుకున్నారు. చింక్‌కాంగ్ పర్వతాల్లో ప్రారంభమైన నిప్పురవ్వ దావానలమై అత్యంత తక్కువ సమయంలో చైనాను విముక్తి చేసింది. చైనా విప్లవం నుంచి ఉత్తేజం పొందిన మనదేశపు కమ్యూనిస్టులు, ఆ విప్లవం విజయవంతమై యాభై ఏళ్ళు దాటినప్పటికీ ఒక్క అక్షరం ముక్కకూడా నేర్చుకోలేదు. ఏ పంథా సరయిందన్న చర్చల్లోనే ఏళ్ళకు ఏళ్ళు గడిపారు. మావోకు ఆచరణ ద్వారా వచ్చిన అనుభవాలే శిరోధార్యం. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలకు అనుభవాలే కీలకం.

ముఖ్యంగా, రష్యాలో వచ్చిన విప్లవాన్ని ఆదర్శంగా తీసుకున్నప్పటికీ, ఆ మార్గంలో మావో పయనించలేదు. చైనా సమాజాన్ని సమగ్రంగా పరిశీలించి మిత్రులెవరో, శత్రువులెవరో తేల్చివేసి హూనాన్ వర్గ పరిశీలన నివేదికను తయారుచేసి చైనా విప్లవానికి మార్గనిర్దేశం చేశాడు.

అయితే భారతదేశం కూడా మూడవ ప్రపంచదేశమనే పేరుమీద చైనాలో ఆ పార్టీ రూపొందించిన వర్గపరిశీలనను భారతదేశానికి మక్కీకిమక్కీ అన్వయించడానికి ఇక్కడ విప్లవకారులు ప్రయత్నించారు. భారత-చైనాల సామాజిక నిర్మాణంలో ఎంతో వ్యత్యాసముంది. అందువల్ల ఈ దేశంలో ప్రత్యేకంగా సమాజ విశ్లేషణ జరగాలి. ఇక్కడ ఉన్న కుల సమాజం గురించి సమగ్ర అధ్యయనం జరగాలి. అప్పుడే సరైన మార్గం నిర్ణయించుకోవడం సాధ్యం.

1927 ప్రాంతంలో జరిగిన చైనా సమాజ పరిశీలన లాంటిది భారతదేశంలో ఇంకా ప్రారంభమే కాలేదు. విప్లవంలో మిత్రులెవరో, శత్రువులెవరో ఇంకా నిర్ణయమే కాలేదు. ఇప్పుడు భారతదేశంలో అనుసరిస్తున్న విధానం చైనాదే కానీ మనది కాదు. సౌరన్ బోస్ లాంటి భారత విప్లవకారులు చైనా నాయకులతో చర్చించిన సందర్భంలో భారతదేశంలో విప్లవానికి సంబంధించి మీ విధానాలను మీరే రూపొందించుకోవాలని, చైనాను అనుకరించవద్దని చేసిన సూచనను ఇక్కడి విప్లవ నాయకులు పట్టించుకోలేదు. అందుకే ఇక్కడ విప్లవం నినాదప్రాయమై చతికిలబడింది.

## ఆచరణవాది మావో

మావో సిద్ధాంతాలను వల్లెవేసేవాళ్ళు కాదు. ఆచరణలో సిద్ధాంతాన్ని పదునెక్కించి, మరింత నూతనంగా వాటిని మెరుగుపరచడం మావోకు ప్రత్యేకం. అందుకే మావో రచనల్లోగానీ, ప్రసంగాల్లోగానీ ఆచరణ సంబంధమైన విషయాలే ఎక్కువ. ఎక్కడ పడికట్టు పదాలు వుండవు. అనవసర కొటేషన్లు వుండవు. చైనా సమాజంలో నుంచే అనేక అనుభవాలను నేర్చుకున్న భూమిపుత్రుడు మావో. కానీ ఇక్కడి విప్లవనాయకులకు కొటేషన్లు కట్టలు తెంచుకొని వస్తాయి. అనుభవాలతో సంబంధం లేని సిద్ధాంతాల గురించి గంభీరమైన ప్రసంగాలు జేస్తారు. మావో రైతు కుటుంబం నుంచి వచ్చినవాడు. స్వయంగా కష్టపడటం ఆయన స్వభావం. ఇక్కడి నాయకులలో చాలామంది నేపథ్యం అందుకు విరుద్ధం.

మావో తన అనుభవాల్ని సంకలనం చేశారు. వాటిని చదివినప్పటికీ దాని సారాన్ని ఇక్కడి విప్లవకారులు పట్టించుకోలేదు. అనుభవం, ఆచరణలో వచ్చిన అవగాహన మావో ఆలోచనా విధానానికి మూలాలు. ఈ విషయాన్ని సరిగా గ్రహిస్తే మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాలని ఈ దేశ పరిస్థితులకు అన్వయించడానికి ప్రయత్నించేవారు. కాని అలా జరగలేదు కాబట్టే పరిస్థితి ఇలా వుంది. ఇప్పటికైనా హూనాన్ వర్గ పరిశీలన కాకుండా, ఈ దేశ సమాజ పరిశీలన జరగాలి.

-ఎం.లక్ష్మయ్య